సత్యం మందపాటి చెప్పిన

# ఎన్నారై కబుర్లు

(మరోటి)




ఇటు ఇండియా,
అటు అమెరికా!
మరి అమెరికాకి
దారి ఎటు?

సత్యం మందపాటి చెప్పిన

# ఎన్నారై కబుర్లు

(మరోటి)

సాహిత్య సౌరభం

గుంటూరు

NRI Kaburlu - Maroti
(Andhra Bhoomi Weekly Column for over four years)

First Edition: January, 2007
Second Edition: February, 2008

**Sahitya Sourabham, Guntur**
Publication No. 1

ISBN: 1-892408-22-8

Copy Right: Satyam Mandapati
Cover Design: Bali
Typesetting: Satyam Mandapati

For Copies in India:

Dr. MDV Ramana Rao, 8th Line, Arundelpet, Guntur-522002
V. Sri Lakshmi, 1-1-231/4, First Floor, Jyothi Bhavan, Chikkadpalli, Hyderabad 500020

Books Available At:

All printed copies are sold out at all leading book shops in India.

Only a few printed copies are available at Kinige.com in India.

For Copies Abroad: (Only a handful available)

Satyam Mandapati, 1006 Vanderbilt Circle, Pflugerville, TX 78660 (USA)

Ph: 512-251-3768 in USA

Email: satyam_mandapati@yahoo.com

Price: Rs 120/- US: $15

ప్రేమానురాగాలకి ప్రతీక

అమ్మలాంటి అత్తగారు

# దిట్టకవి సుభద్రమ్మగారి

## దివ్య స్మృతికి

ప్రేమతో...

భక్తితో...

ధన్యవాదాలతో...

## - సత్యం మందపాటి

## థిక్ ట్రూత్

# మిత్రవాక్యం

ఆంధ్రదేశంలో ఇప్పుడు చెలామణిలో వున్న ఓ మందపాటి సత్యం గురించి చెప్పమంటారా? అమెరికాను తిట్టడం, అదే నోటితో అమెరికాకు ఆహ్వానానికి ప్రాధేయ పడటం. ఎన్.ఆర్.ఐ.లంటే అమెరికా యాత్రకి ప్రయోజకులు. తమ గ్రంధాలను సాంస్కృతిక కళలను డాలర్లలో ప్రోత్సహించేవారు. గొప్ప పెళ్లి సంబంధాలవారు. పైకి సామ్రాజ్యవాద నిరసన. లోన అమెరికా పట్ల ఆరాధన. ఇది హిపోక్రసీయే! కానీ ఇండియాలో, అందునా ఆంధ్రప్రదేశ్లో చెలామణిలో వున్న వాస్తవం.

ఎన్.ఆర్.ఐ.లంటే ఇప్పుడు ఇండియాలోనే వున్నారు. ఎవరంటారా? 'నాన్ రెస్పెక్టేడ్ ఇండియన్స్'. 'మనవాళ్ళు వట్టి వెధవాయలోయ్' అన్నాడు గిరీశం. తెలుగు భాష పట్ల, సంస్కృతి పట్ల, కళారూపాల పట్ల గొప్ప అభిమానంతో అమెరికాలోని తెలుగువారు ఆంధ్రదేశంనించీ సాహితీవేత్తలని, కళాకారులని, సాంస్కృతిక బృందాలని ఆహ్వానిస్తుంటే అక్కడికి వెళ్లి డబ్బు కాపీనంతో, వికార చేష్టలతో గౌరవాన్ని కోల్పోతున్నవారున్నారు. అదే సమయంలో చదువుల కోసం, ఉద్యోగాల కోసం, అనివార్యంగా అమెరికాకి తరలివెడుతున్న భారతీయుల్లో తెలుగువారూ ఎందరో వున్నారు. 'మనిషి మనిషికీ ఒక ఆశ. ఆశ జీవితానికి శ్వాస మరి'. ఈ వ్యవహారమంతా సత్యంకు తెలుసు. అమెరికాలో వున్నా ఆ 'మెరిక' లాంటి సృజనశీలత అతని సొంతం. 'తెలుగువాడు పైకొస్తున్నాడు, తొక్కేయండి' అనే బాపతు గాళ్ళు తనకు బాగా తెలుసు.

మందపాటి సత్యం రచయిత. కథకుడు. అమెరికాలో ఎన్.ఆర్.ఐ.గా, ఉద్యోగం చేసుకుంటూ తెలుగు ఒడి, తెలుగు నుడి, ఒడి చేర్చుకున్నవాడు. అమెరికా గురించీ, ఇండియా గురించీ ఇరుపార్శ్వాలనూ ఎరిగినవాడు. ఇండియానించీ నెలనెలా కొన్ని వేలలో దిగుమతి అవుతున్న మన భారతీయులకీ, ముఖ్యంగా తెలుగువాళ్ళకి అమెరికా జీవితం సవ్యంగా గడపటానికి వలసిన రకరకాల విషయాలపై సమాచారం ఇవ్వాలన్న సంకల్పమే బహు దొడ్డది. 'ఎన్నారై కబుర్లు' అలా రూపు దాల్చినవే! ఆంధ్రభూమి వారపత్రిక ఎడిటర్ ఎ.ఎస్.లక్ష్మిగారు దీన్నొక శీర్షికగా మలచి, వారం వారం రాయించి ఈ కబుర్లకు కాలక్షేపాన్నే కాక, గొప్ప ప్రయోజనాన్ని కూడా సంతరించిపెట్టారు.

చుట్టంచూపుగా వచ్చేవాళ్ళకి ఫరవాలేదు. ఎవరో ఇక్కడ సహాయం చేస్తారు. ఇక్కడ చదువుకోటానికి వచ్చేవాళ్ళూ, ఉద్యోగాలకి వచ్చేవాళ్ళేలాటి బాధలూ పడకూడదనే

తన పాతికేళ్ళ అమెరికా అనుభవంతో చూసినవీ, నేర్చుకున్నవీ, మిత్రుల అనుభవాలూ చక్కని విశ్లేషణలతో, పరిశోధనతో, హాస్య చమత్కారాలతో, మానవీయ విలువలని మూలకందంగా చేసుకుని, మందపాటి సత్యం ఈ కబుర్లు వెలువరించారు.అమెరికాలో భారతీయుల జీవితాన్నీ, ఇండియాలో మనవాళ్ళ అమెరికా మోజునీ నిశితంగా పరిశీలించిన పాటవం, ఈ రెండో సంపుటిలోని డెబ్బై నాలుగు వ్యాసాలలో స్ఫుటంగా, ఇంత విస్తారమైన ఇతివృత్తాలను ఎన్నుకుని నిర్వహించటంలో గొప్పగా ద్యోతకమవుతుంది!

ముళ్ళపూడి రమణ ఊరికే అనలేదు, సత్యానిది 'ఇంఫోటైన్ మెంటాలిటీ' అని. సమాచారాన్నీ, సరదానీ మేళవించి, అదే సమయంలో బాధ్యతలనూ, కర్తవ్యాలనూ గుర్తు చేస్తూ, సలహాలనూ సంప్రదింపులనూ అందిస్తూ, ఈ ఎన్నారై కబుర్లను కేవలం 'డయాస్పోరా' సాహిత్యంగానే కాక, అమెరికా రాగోరేవారికీ, వచ్చి వుండగోరేవారికీ ఒక కర దీపికగా, హితవరిగా సంతరించారు.

'తెలుగు బడి' తెలుగేతర ప్రాంతాల్లో ఇంగ్లీషులో తెలుగు చెప్పే విధానాన్ని తేట తెల్లం చేస్తూ, తెలుగుపై ఇష్టాన్ని, తెలుగుతనం నింపుకునే సిష్టాన్ని చెబుతుంది. 'సునామీ' మానవీయ విలువలను ప్రోది చేసిన ఘటనల సమాహారం. ఔట్ సోర్సింగ్ ఒకటి, మరోటి, ఇంకోటి, సజ్జనులు, దుర్జనులు ఏంటో వైవిధ్యంతో విస్తరించిన సీక్వెల్ కబుర్లు. ఈ కబుర్లలో ముళ్ళపూడి జోకులు చాలాచోట్ల ప్రస్తావించారు. అవన్నీ సందర్భశుద్ధితో విషయానికి బంగారానికి తావిలా అమిరాయి. అమెరికాలో 'రూరల్ సోర్సింగ్' మనకి కనువిప్పు కావాలి. పత్రికల చిత్రిక, పుస్తకం హస్తభూషణం, వెళ్ళొస్తామండీ, చచ్చినా చావకు, విడియో పెళ్లి, చీకటిలో చందమామ, యుద్ధకాండ, మనసా కవ్వించకే, వ్యాపారాయణం.. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో.. ఇన్ని విస్తారమైన విషయాల్ని క్రోడీకరించి, ఇంత కమనీయంగా వివరించి చెప్పడం నిజంగా గొప్ప సృజనాత్మక ప్రతిభ. వారం వారం కైవారం!

అమెరికా వెళ్ళినా, వెళ్ళకపోయినా, ఇండియాలోని ప్రతివారూ ఓసారి ఈ ఎన్నారై కబుర్లు చదివితీరాలి. అమెరికా తెలుగువారూ విధిగా ఈ కబుర్లు తమ అనుభవాలతో కలిపి కలబోసుకోవచ్చు. వెరసి ఇది ఉపయుక్తమైన మాటామంతీ! ఒక మంచి పరామర్శ గ్రంథం. కథకుడిగా ప్రసిద్ధుడైన సత్యం మందపాటి ఈ కబుర్ల ద్వారా ఒక ఇష్టుడైన కాలమిష్టుగా, హ్యూమనిష్టుగా, తనదైన హ్యూమరిష్టు పంథాలో పాఠక జన హృదయాలను నిస్సందేహంగా అలరించగలడు. అందుకు దాఖలాయే ఈ 'ఎన్నారై కబుర్లు'. మార్గదర్శక రచయితగా అమెరికాకు, ఆంధ్రదేశంలోనూ ఇక ఈ మందపాటి సత్యం గొప్ప చెలామణిలో వుండటం ఖాయం. ఇది మిత్ర వాక్యం.

సదా మీ

సుధామ

# సత్యం - శివం - సుందరం

ఎన్నారై కబుర్లలో వ్రాసినట్టుగా, నేను ఎప్పుడు వివిధ సంస్కృతుల గురించి తెలుసుకునే సెమినార్లకి వెళ్ళినా, నన్నో విషయం బాధిస్తూ వుండేది.

చైనా జపాన్‌లాటి దేశాల్లో మనం ఎలా ప్రవర్తించాలో ఎలా ప్రవర్తించకూడదో, ఏం చెప్పాలో ఏం చెప్పకూడదో నేర్పే సెమినార్లవి. అవేవో సరదాగా వున్నా నాలాటివారికి ఎంతో ఉపయోగకరంగా వుండేవి. మనకి కావలసినవక్కడ సాధించుకురావటానికి ఎంతో దోహదం చేసేవి. మరి ఇండియానించీ నెలనెలా కొన్నివేలలో దిగుమతవుతున్న భారతీయులకి ముఖ్యంగా తెలుగువారికి అమెరికా జీవితం సవ్యంగా గడపటానికి కావలసిన విషయాలపై సమాచారం ఇచ్చేవారు నాకు కనపడలేదు. చుట్టం చూపుగా వచ్చేవాళ్ళకి ఫరవాలేదు ఎవరో ఇక్కడ సహాయం చేస్తారు. చదువుకోటానికి వచ్చేవాళ్ళూ ఉద్యోగాలకి వచ్చేవాళ్ళు మొదట్లో నానా బాధలూ పడటం చూస్తున్నదే.

ఇండియాలో స్నేహితుల ద్వారా చూసేవి పరిమితమైన అనుభవాలు. అందుకని నా పాతికేళ్ళ అమెరికా అనుభవంలో, నేను చూసినవీ నేర్చుకున్నవీ, మిత్రుల అనుభవాలూ, నాకు చేతనైన పద్ధతిలో వ్రాసి, పాఠకులకి అందివ్వటం నా బాధ్యత అనిపించింది.

అలాటివి నాలుగైదు వ్యాసాల్లో వ్రాసి ఆంధ్రభూమి వారపత్రికకి పంపించాను. ఎయస్‌లక్ష్మిగారవి ప్రచురిస్తాను కానీ, నాలుగైదులా కాదు ఒక శీర్షికలా వారపత్రికలో నడుపుదామని ఉత్తరం వ్రాశారు. ఇక్కడ ఆఫీసు పనితోనూ, తత్సంబంధమైన ప్రయాణాలతోనూ, నేను నడుపుతున్న తెలుగు స్కూలు పనితోనూ, కథా వ్యాసాంగంతో అప్పటికే ఎన్నో గంటలు పనిచేస్తున్న నాకది జరిగే పనిలా కనిపించలేదు. అదే వ్రాశాను. కానీ పట్టు విడవని లక్ష్మిగారు, మీరు కనీసం పది వ్యాసాలు వ్రాసేదాకా ఆగి, అప్పుడు ప్రచురణ మొదలుపెడతాను, దానితో మీకు సమయమూ సరిపోతుంది, వెసులుబాటూ అవుతుంది అని మొహమాట పెట్టారు. అలా మొదలయినాయి ఈ ఎన్నారై కబుర్లు.

ఒక సంవత్సరం పైన, అంటే 66 వ్యాసాలు వ్రాశాక, ఆపేద్దామనుకుని ఆగనా సాగనా అని ఒక వ్యాసం వ్రాశాను. సంపాదకులూ, పాఠకులూ సాగమనే ఆశీర్వదించారు. అలా ఈ వ్యాసాలు ఇప్పటికి నాలుగు సంవత్సరాల పైగా, 200

వ్రాశాను. అనుకున్నదానికన్నా ఇన్నాళ్ళు దీన్నిలా నడిపించింది లక్ష్మిగారి ప్రోత్సాహం పట్టుదలా. తర్వాత పాఠకుల స్పందనా వారి ఈమెయిల్సూ. మూడవది నాకు తెలిసిన విషయాలు నలుగురితో పంచుకోవాలనే తపనా.

గవర్నమెంటాలిటీ కథలు అనే నా పుస్తకానికి, గురువుగారు ముళ్ళపూడి వెంకటరమణగారు ముందుమాట వ్రాశారు. నేను నా రచనల్లో, ఇన్ఫర్మేషన్ ఇస్తునే ఎంటర్టెయిన్ చేస్తాననీ, అందుకని నాది 'ఇన్ఫోటైన్మెంటాలిటీ' అనీ వ్రాశారు. దానికి జవాబుగా నేను కూడా - నా రచనల్లో ఎక్కడయినా హాస్యం కనిపిస్తే అది రమణగారి ప్రభావం అనీ, కనపడకపోతే అది నా 'రాత' అనీ వ్రాశాను. ఈ ఎన్నారై కబుర్లలో మీకు ఆ ఇన్ఫోటైన్మెంట్ కనిపిస్తే అది ఆయన ఆశీర్వాద ఫలితం.

నేను వ్రాసిన వాటిలో, నాకు వచ్చిన పాఠకుల స్పందన ప్రకారం, కొన్ని ఎంతో ఉపయోగకరంగానూ, కొన్ని హాస్యపూరితంగానూ, కొన్ని వ్యంగ్యంగానూ వున్నాయని. కొన్ని బాగాలేవనీ, వాటిల్లో పైన చెప్పినవి ఏమీలేవనీ, చెప్పిన వాళ్ళందరికీ కృతజ్ఞతలు. అవే నన్ను విషయపరంగా ముందుకు నడిపించిన మణిదీపాలు.

ఆంధ్రభూమి వారపత్రిక సంపాదకవర్గంవారికీ, ముఖ్యంగా లక్ష్మిగారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన మిత్రులూ, శ్రేయోభిలాషులూ రచన శాయిగారికి ధన్యవాదాలు. చక్కటి ముఖచిత్రం వేసిన కరుణాకర్‌గారికి కృతజ్ఞతలు. నేనూ రోజూ క్రమం తప్పకుండా, రెండు మూడు గంటలు వ్రాసుకోవటానికి, ఈ నాలుగేళ్ళూ, ఓపికతో సహకరించిన నా సహధర్మ చారిణి విమల నిజంగా సహన ధర్మచారిణే!

నేను వ్రాసిన 200 వ్యాసాలూ ఒక పుస్తకంలో పట్టటంలేదు కనుక, ఎన్నారై కబుర్లు - ఒకటి, ఎన్నారై కబుర్లు - మరోటి, అని రెండు పుస్తకాలుగా ప్రచురిస్తున్నాం. ముందు చాల వ్యాసాలు తీసేసి, కొన్నే ఒకే పుస్తకంగా వేద్దామనుకున్నాంకానీ ప్రజాభిప్రాయం వేరుగావుంది. అన్నీ మాకు గైడుల్లా ఉపయోగపడేవే, ఆనందింపచేసేవే, కనుక అన్నీ కావాలన్నారు. కాకపోతే, కొద్ది వ్యాసాల్ని తీసేసి రెండు పుస్తకాలుగా అందిస్తున్నాం. మీ అభిప్రాయాలు ఈమెయిల్ ద్వారా తెలియచేస్తే సంతోషిస్తాను.

భవదీయుడు
సత్యం మందపాటి

# ఇందులో...


1. పుట్టింటి భార్యలు
2. వన్ డే మాతరం
3. పట్టాభిషేకం
4. రాముని తోక
5. మానవసేవ
6. అమెరికా గ్లామర్
7. ఉడత సాయం
8. సునామీ
9. వి(దేశీ)చిత్రాలు
10. గణపతి
11. ఇరుగూ - పొరుగూ
12. మంచీ - చెడూ
13. నవ్వితే నవ్వండి
14. ఇంద్ర ధనుస్సు
15. ఔట్‌సోర్సింగ్ - ఇంకోటి
16. నేను
17. బ్లాక్ పార్టీ
18. పనికిమాలిన పని
19. ఔట్‌సోర్సింగ్ - సజ్జనులు
20. కొడుకులు - కూతుళ్ళు
21. గోడ మీద బొమ్మ
22. గ్రామ సంగ్రామం
23. ఉద్యోగ విజయాలు
24. పత్రికల చిత్రిక
25. ఔట్‌సోర్సింగ్ - దుర్జనులు
26. పుస్తకం హస్తభూషణం
27. చదువులా? చావులా?
28. సూపర్ మాన్
29. మాంగల్యం తంతునానేనా...
30. టైము లేదు
31. మా రోజుల్లో
32. పుస్తకమా, నీ విలువెంత?
33. వేయి వేషాలు వేయి
34. ఎం.డి.
35. మరమనిషి
36. తెలుగు బడి
37. లా.. ఒక్కింతయు...
38. సాహితీ పెత్తందార్లు
39. తాతల మూతులు
40. బురదలో బంతిపూలు
41. జానెడు స్వర్గం
42. యుద్ధకాండ
43. సమ్మతం
44. లాబీ... లాబీ...
45. వెళ్ళొస్తామండీ!
46. ఓ ఫైవ్ వుందా సార్!
47. చచ్చినా చావకు
48. చివరికి మిగిలింది
49. రెండు పోల్స్
50. రాభణుడు
51. విడియో పెళ్ళి
52. క్షమ
53. రాజుగారి మంగలి
54. చీకటిలో చందమామ
55. మన కోసం మనం
56. నేను లేక నువ్వు లేవు
57. మరో చరిత్ర
58. నిత్య పెళ్ళికొడుకులు
59. నాతి చరామి
60. మాయ(మైన) మొగుళ్ళు
61. న్యాయం - ధర్మం
62. పోవాలని వుంది
63. భావి పౌరులు
64. పాస్‌వర్డ్ పజిల్
65. హింసాకాండ
66. అశాంతి పర్వం
67. కాలం మారింది
68. పెద్దపులులు
69. విలువలు
70. గాంధి
71. ప్రేమంటే ఇదేరా!
72. ఏడడుగులు
73. మనసా కవ్వించకే!
74. వ్యాపారాయణం

# పుట్టింటి భార్యలు

దాదాపు ఒక సంవత్సరం క్రితం నాకు ఇంకొక అమెరికన్ సిటీ నించీ ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తనని పరిచయం చేసుకున్నాక 'మీరు నాకు తెలియకపోయినా చనువు తీసుకుంటున్నాను. మన్నించాలి. మీవల్ల నాకొక సహాయం కావాలి. అందుకని' అన్నాడు.

'అదేం ఫరవాలేదు. నేను చెయ్యగలిగిందయితే తప్పకుండా చేస్తాను. నన్నే ఎందుకు అడుగుతున్నారు' అడిగాను నవ్వుతూ.

'మా సోమసుందరంగాడి బాధ చూడలేక. మీవూళ్ళో నాకింకెవరూ తెలీక. నేను కొన్న మీ పుస్తకంలో మీ ఫోన్ నెంబర్ వుంది కనుక... ' అన్నాడు.

ఆయన ఆ మాటలు బాధతో అంటున్నట్టు తెలుస్తూనే వుంది.

నేనూ కొంచెం నొచ్చుకుని 'చెప్పండి' అన్నాను.

'మా సోమసుందరం, అంటే నా స్నేహితుడులెండి, మొన్న ఫోన్ చేశాడు. అతను అనంతపురంలో స్టేట్‌బాంక్‌లో పనిచేసి, రిటైరయి అక్కడే సెటిలయి పోయాడు. ఒక్కత్తే కూతురు. మూడేళ్ళ క్రితమే పెళ్ళి చేశాడుట. అమెరికా వచ్చాక నాకు అతనితో టచ్ పోయింది. అల్లుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరుట. మామగారి ముక్కు పిండి ఇరవై లక్షలు కట్నం కూడా తీసుకుని అమెరికా వచ్చాట్ట. దాదాపు రెండున్నర ఏళ్ళుగా మీ వూళ్ళోనే వుంటున్నాడుట. భార్యని మాత్రం అమెరికా తీసుకురాకుండా ఇండియాలోనే వుంచాడుట. ఇక్కడ ఉద్యోగం పోయిందనీ డబ్బులకి అల్లల్లాడుతున్నా ననీ, డబ్బులు పంపించమనీ వేధిస్తుంటాడుట. నెలకి రెండు వేల డాలర్లు, అంటే ఇండియాలో లక్ష రూపాయలకి కొంచెం తక్కువగా, ఆయన్ని పంపించమనీ, లేకపోతే కాపురం చేయలేననీ బెదిరించి, ఇప్పటిదాకా ఇంకో పది లక్షలు వసూలు చేశాట్ట. తలకు మించిన భారం అవటంతో ఇక ఇవ్వలేనన్నాడుట. పోయిన నెల ఫోన్ చేసి, తనకి విడాకులు కావాలని పట్టుబట్టాడుట' ఆయన చెప్పటం ఆపాడు.

ఇలాటి కథలు అప్పుడప్పుడూ వింటూనే వున్నాను కానీ, మరీ ఇంత దారుణం ఎప్పుడూ వినలేదు. 'అలాగా పాపం. ఇంతకీ ఇది నాకెందుకు చెబుతున్నారు' అడిగాను, నిజంగానే నా సానుభూతిని వ్యక్తపరుస్తూ.

'ఏమీలేదు. మా సోమసుందరంకి ఒక అనుమానం. అతనికి వేరే పెళ్ళి అయిందేమోననీ, అందుకే వాళ్ళ అమ్మాయిని తీసుకురాకుండా నెట్టుకువస్తున్నాడేమో ననీ. అతని పేరు ఫలానా. మీరు అతను అక్కడ ఒంటరిగా వుంటున్నాడా, వేరే పెళ్ళ యిందా మొదలైన విశేషాలు కనుక్కోగలరా? అలా అయితే, విడాకులు ఇవ్వకుండా, కోర్టుకి వెడదామని యన ఉద్దేశ్యం' అన్నాడు ఆయన.

ఆ వ్యక్తి ఎవరో నాకు తెలియకపోయినా, ఒక తెలిసిన ఆయన ద్వారా అతని గురించి వాకబు చేశాను. సామసుందరంగారు భయపడినట్టుగానే, అతను పెళ్ళిచేసుకుని 'భార్య'తో సుఖంగా వుంటున్నాడు. వెంటనే నాకు తెలిసిన సమాచారం

ఆయనకి అందించాను. తర్వాత ఏమయిందీ అన్నది కాదు మనకి ముఖ్యం. అసలు ఇలా ఎందుకు జరిగిందే అని.

ఇది ఎప్పుడో ఒకప్పుడు జరిగే అరుదైన సంఘటన కాదు. నాలుగైదేళ్ళుగా ఇలాటి కథలు వింటూనేవున్నాం. ఇక్కడ లభ్యమయే గణాంకలు చూస్తే ఇండియాలో ఇలాటి కేసుల్లో పంజాబు మొదటి స్థానంలో, ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో వున్నా యని తెలుస్తోంది. పంజాబ్‌లో దావ్‌బా ప్రాంతంలో కొన్ని జిల్లాలలో ఇలాటి మోసపో యిన బాధితుల సంఖ్య వేలల్లో వుందిట. మనరాష్ట్రంలో ప్రధమం మన రాజధానిది.

రీటా అనబడే పంజాబీ అమ్మాయి ఇంగ్లాండ్‌లో వుండే పంజాబీ అతన్ని, ఘనంగా కట్నమిచ్చి పెళ్ళిచేసుకుంది. విమానం ఎక్కిన పది నెలల్లో, మళ్ళీ విమానం ఎక్కి తిరిగి వచ్చేసింది. అక్కడికి వెళ్ళిన రోజునించీ ఇంకా డబ్బులు ఎక్కువ తెమ్మని భర్త వేధించటం, కొట్టటం ఆమె భరించలేక వెనక్కి వచ్చేసింది. ఇంకా నయం, చాల మంది అభాగినులలా ఆత్మహత్య చేసుకోలేదు. కొంతమంది అమ్మాయిలు, ఇలా విదేశీ వివాహాలు విరిగిపోయి పుట్టింట్లోనే కలకాలం వుండిపోతున్నారు.

'పుట్టింటి భార్యలు' అని వీళ్ళకి ఇచ్చిన పేరు ఒక పత్రికలో చదివాను. ఇండియాలోని తల్లిదండ్రులకి వీళ్ళ ఆచూకీ అంతు చిక్కకుండా, అడ్రసులూ ఫోన్ నెంబర్‌లూ మార్చేస్తున్నారుట. నాకు వచ్చిన ఫోన్ అలాటి అమెరికా మొగుడ్ని వెతు క్కుంటూ వచ్చిందే. మరి కొంతమంది అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, దుబాయ్ మొదలైన దేశాల్లో మొగుడి చేత రోజూ దెబ్బలు తింటూ, నానా బాధలూ పడుతూ, అటు ఇండియాలో తల్లిదండ్రులకి చెప్పలేక, ఇటు విదేశాల్లో పోలీసులకి రిపోర్ట్ చేయటానికి ధైర్యం చాలకా జీవశ్చవాల్లా బ్రతుకుతున్నారు. అంతేకాదు, కొంతమంది కయితే, ఇండియాకి వెళ్ళి పోకుండా పాస్పోర్టులు దాచేస్తున్నారుట. ఇండియాకి ఫోన్ చేయకుండా కట్టుదిట్టం చేస్తున్నారు. దానివల్ల ఈ మగ మహారాజులకి లాభం ఏమిటి అనేది ఒక చిన్న ప్రశ్న. లాభాలు చాలవున్నాయి.

వీళ్ళల్లో దాదాపందరూ, విదేశీ మొగుళ్ళు కనుక లక్షల్లో కట్నాలు గుంజిన బాపతే. కొంతమందికయితే విదేశీ వీసా రాగానే కట్నం మూడు నాలుగు రెట్లు పెరిగి పోతుంది. అంతేకాదు విదేశీయానానికి టిక్కెట్లు కూడా పిల్ల తల్లిదండ్రులే భరిం చాలి. మన తెలుగుదేశంలో ఇలాటివి పైకి చెప్పుకోవటానికి పరువు నష్టం. నామర్దా. అందుకని చాలమంది కిక్కురుమనకుండా పైకి రానీయటంలేదు. మన సోమసుంద రంగారిలా కోర్టుకి వెడదామనుకున్నా అదంత సులభంకాదు. కేసు విదేశీ కోర్ట్‌లోనా, ఇండియన్ కోర్ట్‌లోనా అనేది అంతర్జాతీయ సమస్య. అది వీసాలని బట్టి వుంటుంది. విదేశాలలో కేసు పెట్టాలంటే లాయర్లకీ, కేసు పూర్తయ్యేదాకా అక్కడ వుండటానికీ మిగతా ఖర్చులకీ రూపాయల్లో ఎన్నో లక్షలవుతుంది. అది మరీ డబ్బున్నవాళ్ళకి తప్ప మధ్య తరగతివాళ్ళకి సాధ్యం కాదు. గమ్మత్తు ఏమిటంటే ఇలాటి సమస్యలు మధ్య తరగతి కుటుంబాల్లో ఎక్కువ. అంతకుముందే కట్నాలు లక్షల్లో కుమ్మరించి మునిగి పోయిన వారికి అది అసాధ్యం. కేసు ఇండియాలో పెడదామనుకుంటే, అది తేలేట ప్పటికీ యుగాలు పడుతుంది. లేదా అల్లుడి కట్నాల బాకీకన్నా ఈ లంచాల గిట్నాలు

ఎక్కువవుతాయి.

అమాయకులైన అమ్మాయిలని పెళ్ళి చేసుకునో, పెళ్ళి చేస్తామనో ఆశపెట్టి దుబాయిలో, కువాయట్లో, సౌదీ అరేబియాలో వాళ్ళని అమ్ముకునే ఏజెన్సీలు హైద్రాబాద్‌లో కొల్లలని వార్తల్లో చదువుతున్నాం. ఆమధ్య అలాటి అమ్మాయిని ఒక ఎయిర్ హోస్టెస్ రక్షించిందని వార్తల్లో  వచ్చింది.

అయితే ఈ మోసాలు మగవాళ్ళకే పరిమితమా? కానే కాదు. హైదరాబాద్ నించీ న్యూయార్క్‌లో దిగగానే, ఒకావిడ భర్తని కాదని అంతకుముందే ప్రేమించిన అతనితో వెళ్ళిపోయిందిట. ప్రేమించినతను ముందే అమెరికా వచ్చేశాడు. ఆమెకి ఇక్కడికి రావటానికి వేరే మార్గం దొరకలేదు. వీసా కోసం ఇంకొకతన్ని పెళ్ళి చేసుకుంది. అమెరికా రాగానే, భర్తకి బై చెప్పేసింది.

ఇంతకుముందు ఎప్పుడోకానీ విననివి, ఇప్పుడు ఎందుకు ఎక్కువయాయి? దానికి చాల కారణాలు కనిపిస్తున్నాయి. ఇంతకుముందు అమెరికా ఇంగ్లాండ్ కెనడా దేశాలకి వెళ్ళేవాళ్ళు పైచదువుల కోసం, సాంకేతికంగా ఏదో సాధించటంకోసం వెళ్ళేవాళ్ళు. ఆ రోజుల్లో అలా వెళ్ళేవాళ్ళ సంఖ్య తక్కువ. ఇప్పుడలా కాదు. రకరకాల ఉద్యోగాలు అన్ని దేశాలలో వీరిని ఆహ్వానిస్తున్నాయి. విదేశీయానం గుంటూరునించీ విజయవాడ వెళ్ళినంత సులభంగా మారిపోయింది. మనుష్యుల్లో కట్నాల కాపీనం, డబ్బు కాపీనం విపరీతంగా  పెరిగిపోయింది. ఒకనాటి ఆధ్యాత్మిక భారతదేశం, ఏనాడు పడమటి దేశాల కన్నా భౌతిక సుఖాలకి ఎక్కువగా బానిస అయిపోయింది. బాంధవ్యాలకన్నా లక్ష్మీదేవి మీదే బంధుత్వం ఎక్కువయింది. మోసాలు చేసే వాళ్ళని శిక్షించాల్సినవాళ్ళూ, అమాయకులనీ రక్షించాల్సినవాళ్ళూ లంచాలకి లొంగిపోయారు. కొంతమంది అమెరికా నించీ ఆదివారం ఇండియా వచ్చి, సోమ మంగళవారాల్లో ఏడుగురిని చూసి, బుధవారం తాంబూలాలూ, శనివారం పెళ్ళీ చేసుకుని ఆదివారం మళ్ళీ  అమెరికా వెళ్ళిపోతున్నారు. పదేళ్ళల్లో పాడయిపోయే కలర్ టీవీ కొనుక్కోటానికే రెండు నెలలపాటు అన్ని షాపులూ తిరిగేవాళ్ళు, జీవిత కాలం నిలవవలసిన వివాహానికి ఎందుకు ఇంత హడావిడి పడుతున్నారు? ఇవీ నా ఆలోచనా పరిధిలోకి వచ్చిన కారణాలు. మీకు తట్టినవి మీరు వ్రాసుకోండి.

మరి ఇవన్నీ చదివి, విదేశీ పెళ్ళికొడుకులంతా మోసగాళ్ళే అనుకోవద్దు. అది నిజమూ కాదు, నా అభిప్రాయమూ కాదు. కానీ ఇలాటివి జరుగుతున్నాయి. మన జాగ్రత్తలో మనం వుండకపోతే, అలా దెబ్బ తినేది మనమే అయే అవకాశాలున్నాయి. అందుకే బంధుమిత్రుల్లో ఎవరైనా విదేశాల్లో వున్న సంబంధాలు కనుక్కోమంటే, ముందు నేను ఇచ్చే సలహా తొందర పడవద్దని. మంచీచెడూ బాగా విచారించకపోతే, తరువాత విచారించవలసి వస్తుందని. చక్కగా చదువుకుని, మంచి ఉద్యోగాల్లో వున్న సంబంధాలు విదేశాల్లో కన్నా ఇండియాలోనే ఎక్కువగా వున్నాయి.

ఈ పుట్టింటి భార్యలు అనే పదం మన తెలుగులోకి ఎంత త్వరగా వచ్చిందో, అంత తొందరగా తుడిపేయటం అవసరం.

0 0 0

# ఏన్ డే మాతరం

పెద్ద పెద్ద కళ్ళు. రెండు కళ్ళకి పైన విశాలమైన నుదురు. నుదుటి మీద, గోరింటాకు పెట్టిన వేలితో సుతిమెత్తంగా అద్దుకుంటున్న ఎర్రటి బొట్టు . నెమ్మదిగా కెమేరా వెనక్కి వెడుతుంది. మనకి అద్దంలో తన అందమైన నుదుటి మీద కుంకుమ బొట్టు పెట్టుకుంటున్న విశాల నేత్రి కనపడుతుంది. ఇది బాపూగారి సినిమాల్లో నాకు బాగా ఇష్టమైన సీను.

గుంటూరులో మా పదిహేనేళ్ళ నీలిమ ఎప్పుడూ అద్దం ముందే నిలుచుని తన అందాల్ని తనే చూస్తుంటుంది. అంత బాగుంటుంది మరి.

అద్దం గురించి పైన చెప్పినవన్నీ సాధారణంగా మనమందరం చూశేవే అయినా మనకి అద్దం నేర్పే పాఠాలు ఎన్నో వున్నాయి. అద్దంలో మనం ఏం చూడాల నుకుంటే అది చూడచ్చు. కాకపోతే మనం అద్దం ముందు అది పెట్టటమో, అద్దాన్నే వస్తువు ముందు పెట్టటమో చేయాలి. అద్దంలో కనపడేవి, అద్దంలో బొమ్మల్లా, బాగానే వుంటాయి. మరి అద్దానికి వెనక 'ఏముంటాయి? ఏముంటుంది? - ఏమీ వుండదు. అద్దాన్ని గోడకి తగిలిస్తే దాని వెనక గోడ, స్థంభానికి తగిలిస్తే దాని వెనక స్థంభం వుంటాయి అంతే' అంటాడు మా సుబ్బారాయుడు అమాయకంగా.

కాదు చాల వుంటుంది. నిజజీవితం వుంటుందక్కడ. రోజూ జరిగే సంఘటనలూ మన కష్టాలూ సుఖాలూ వుంటాయక్కడ. మనం అద్దంలో ఏమిటి చూడొద్దనుకుంటామో అవన్నీ వుంటాయక్కడ.

0 0 0

పోయినసారి గుంటూరు వెళ్ళినప్పుడు మా ఇంటికి వచ్చారు రామ్మూర్తి వాళ్ళావిడ సీతమ్మ. వాళ్ళ అబ్బాయి చికాగోలోనూ, అమ్మాయి డల్లాస్‌లోనూ వుంటున్నారుట. వాళ్ళక్కడ సుఖంగా వున్నారు అన్నదావిడ.

'బాగుందండీ! మీకున్న ఇద్దరు పిల్లలూ సెటిల్ అయిపోయారన్నమాట' అన్నాను.

ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు 'అవును బాగానే సెటిల్ అయారు... కాకపోతే నేనూ నా భార్యా ఈ పెద్దవయసులో ఇక్కడ ఒంటరిగా మిగిలిపోయాం'

'అదేం? మీరూ హాయిగా అక్కడికే వెళ్ళి కొన్నాళ్ళు వుండొచ్చు కదా?'

అదోలా నవ్వాడాయన. 'వెళ్ళాం బాబూ! ఐదు నెలలు వున్నాం కూడాను. అక్కడి జీవితమే వేరు. అబ్బాయీ కోడలూ, అమ్మాయీ అల్లుడూ అందరూ ఉద్యోగాల్లో వున్నవాళ్ళే. పొద్దున్న ఏడుంబావుకి బయలుదేరి వెడితే మళ్ళీ సాయంత్రం ఆరు గంటల తర్వాతే రావటం. మాకేమో తోచి చావదు. బయటికి వెడదామంటే కారూ, అక్కడి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కుదరదు. రోడ్డు మీద మనుష్యులు కనపడరు. నాలాటి వాళ్ళు అక్కడ వుండలేరు' అన్నాడు రామ్మూర్తి.

సీతమ్మ నవ్వి 'ఈయన తరహాయేవేరు నాయనా! అమెరికాలోకూడా అన్నీ

గుంటూరులోలా వుండాలంటారు. అదెలా కుదురుతుంది. ఇక్కడ యాభై ఏళ్ళనించీ వున్నాం కనుక వూళ్ళో అందరూ తెలిసినవాళ్ళే. రోడ్డు మీదకి వెడితే అందరూ పలకరించే వాళ్ళే. తెలుగు పేపర్లూ, తెలుగు టీవీ, తెలుగు పుస్తకాలూ, రిటైరయినా కాలక్షేపానికేమీ ఢోకా లేదు. అక్కడా అవన్నీ కావాలంటే ఎలా వస్తాయి? మావాడు జెమినీ టీవీ పెట్టించాడు. ఇంటర్నెట్లో ఆంధ్రభూమీ ఆంధ్రజ్యోతీ దినపత్రికలు చదవటం చూపించాడు. శనివారం వాళ్ళ స్నేహితులతో పార్టీల పేరుతో కలుస్తూనే వున్నాం. అయినా ఈయనకి కాలక్షేపం కావటంలేదంటారు.' అన్నదావిడ.

'మరి మీకో?' అడిగాను నవ్వుతూ.

ఆవిడా నవ్వింది. 'నాకదేమీలేదు. ఇక్కడవున్న సందడి అక్కడ వుండదు. పొద్దుటినించీ పనిమనిషీ పాలమనిషీ కూరలవాళ్ళూ పోష్టుమానూ... ఇలా ఎవరో ఒకళ్ళు పలకరిస్తుంటారిక్కడ. ఇద్దరం ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళమే అయినా, వాళ్ళ ఏక్సెంట్ అంత తొందరగా మనకి అర్థమవదు. అక్కడి పద్ధతులు అక్కడివి. మనం వాళ్ళ దేశం వెళ్ళి వాళ్ళ సంస్కృతిని మనలాగా లేదు అని అలిగితే ఎలా?' అందావిడ.

'నేను కంప్లైంట్ చేయటంలేదు. నా బాధ చెప్పుకుంటున్నాను. అంతే' అన్నాడాయన సమర్థించుకుంటూ.

'మరి ఏం చేద్దామనుకుంటున్నారు' అని అడిగాను.

'ఏముంది. ఉన్న ఇద్దరు పిల్లలనీ పరదేశానికి అర్పించి, ఈ వయసులో ఒంటరిగా ఇక్కడే కాలం వెళ్ళబుచ్చుదామనుకుంటున్నాం. మనవలూ మనవరాళ్ళూ పుడితే, ఓపికుంటే ఇంకోసారివెళ్ళి ఐదారు నెలలు వుండి వస్తాం. లేదా వాళ్ళతో ఇక ఫోన్లోనే మాటామంతీ. మాకిక్కడ రోగమొచ్చినా రొష్టు వచ్చినా మేమిద్దరమే ఒకళ్ళ కొకళ్ళం ఎవరూ లేనివాళ్ళలా' ఆయన ముఖంలో బాధ స్పష్టంగా తెలుస్తూ వుంది.

'వాళ్ళు తిరిగి ఇండియాకి వచ్చేస్తారన్న ఆశ లేదు. కాకపోతే ఎక్కడయితేనేం సుఖంగా వుంటే అంతే చాలు' అన్నదావిడ.

వాళ్ళు వెళ్ళిపోయినా వాళ్ళ మాటలు నన్ను వెంటాడుతూనే వున్నాయి. ఈ విషయం కొత్తదేమీ కాదు. అమెరికాలోనూ, ఇండియాలోనూ చూస్తున్నదే. అప్పుడే అంతకుముందు వారంరోజుల క్రితం, నన్ను కలిసిన సుబ్రమణ్యం శ్యామల గుర్తు కొచ్చారు. వాళ్ళకి ఒక్కగానొక్క కూతురు. ఆయనకి అమ్మాయి వాళ్ళ కళ్ళ ముందరే ఇండియాలో వుండాలని కోరిక. ఆవిడకి మాత్రం అమెరికా సంబంధం తెచ్చి, అమ్మాయిని అమెరికా పంపించాలని.

నేను చెప్పవలసిన మంచీ చెడు రెండూ చెప్పి నిర్ణయం వాళ్ళకే వదిలేశాను. కొన్నాళ్ళు అమెరికాలో వుండి వెనక్కి తిరిగి వచ్చేద్దామనుకుని వెళ్ళేవాళ్ళే అందరూ. కాకపోతే గణాంకాల ప్రకారం వాళ్ళల్లో వేయిమందికి ఒక్కరు మాత్రమే వెనక్కి తిరిగి వెడుతున్నారు. వీసాల వల్ల వచ్చే సమస్యలతో వెనక్కి వెళ్ళే వాళ్ళే ఎక్కువమంది కనపడతారు. తమంతట తామే వెళ్ళే వాళ్ళు లేరని కాదు. తక్కువ అని.

శ్యామల అన్నది, 'మాఅమ్మాయి అలాటిది కాదు. అక్కడ కొన్నాళ్ళు వుండి ఆర్థికంగా బలపడి వెనక్కి వచ్చేస్తుంది. ఈలోగా మేమూ ఒకటి రెండు సార్లు వెళ్ళి

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/NRI+Kaburlu+Maroti](http://kinige.com/book/NRI+Kaburlu+Maroti)**

*** * ***